

కొనసాగుతున్న వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



.. కానరాని లోకాలకు

నారాయణపేట మండలం తిర్మలదేవునిపల్లి ఆసిరెడ్డి చెరువులోపడి ఇద్దరు మృతిచెందారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.2 /24.1

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. రాత్రి వేళ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల సమస్యలను గాలికొదిలేశారు..

● మానవహక్కుల సంఘానికి లేఖ



గద్వాల: ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పూర్తిగా గాలికొదిలేశారని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ భీంసేన్‌రావు మానవహక్కుల సంఘానికి లేఖ రాశారు. గద్వాల పట్టణ పరిధిలోని అర్బర్ రెసిడెన్సియల్ పాఠశాలలో పేద కుటుంబాలకు చెందిన పలువురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే రెసిడెన్సియల్ పాఠశాల కొనసాగిస్తున్న చిన్నపాటి బిల్డింగ్‌లోనే పాఠాలు బోధిస్తుండడం, భోజనాలు, నిద్రించడం అంతా అక్కడే చేస్తుండడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పదిరోజుల క్రితం రెసిడెన్సియల్ పాఠశాలలో బోరుమోటారు పూర్తిగా కాలిపోయింది. దీంతో తాగేందుకు, స్నానాలు చేసేందుకు, చివరికి వంట చేసేందుకు నీళ్ల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న పొలం వద్దకు విద్యార్థులే వెళ్లి నీరు తీసుకొస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న రెసిడెన్సియల్ పాఠశాల దుస్థితి ఇలా ఉందంటే మిగిలిన పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. విద్యార్థులు పడుతున్న అవస్థలపై వెంటనే స్పందించి వారి సమస్యలు తీర్చాలని మానవహక్కుల సంఘాలనికి రాసిన లేఖలో కోరారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి



గద్వాలటౌన్: పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ జిల్లా సర్వ సభ్య సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండులక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షులుగా రవి, భూషిరెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా కృష్ణవేణమ్మ, ఉపాధ్యక్షులుగా రవిప్రకాష్, నరేష, నాగరాజు, వెంకట్రాములు, మక్బూల్ హుస్సేన్, మహిళా ఉపాధ్యక్షులుగా విజయమ్మ, కార్యదర్శులుగా వెంకటేష్, సురేందర్, మక్బూల్ అహ్మద్, మద్దిలేటి, విక్రంసింహచారి, మహిళా కార్యదర్శిగా రేణుక, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతులలో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూస్తామని, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నూతన పీఆర్‌సీ ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయిస్తామన్నారు. సందర్బంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్రామయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలి



గద్వాల అర్బన్: లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం వచ్చిన లబ్ధిదారులతో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో లబ్ధిదారులు అద్దె, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై గత నెల 7న కలెక్టరేట్‌ను ముట్టడించామని, ఈ క్రమంలో కలెక్టర్ లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నెలరోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు అందజేయలేదన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా ఇళ్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలని.. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఉప్పేరు నర్సింహ్మా, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

నష్టం @ 968 ఎకరాలు

ఎడతెరిపి లేని వర్షాలతో నీటమునిగిన వేరుశనగ, టమాట, జీర



వడ్డేపల్లి మండలం జులెకల్ గ్రామ శివారులో నీటిలో పత్తి పంట

- పూత దశలోనే పత్తికి వర్షం దెబ్బ
- ఏపుగా పెరుగుతున్న ఎండుమిర్చి, కంది వర్షార్పణం
- నాట్ల దశలోనే నీట మునిగిన వరి

గద్వాల వ్యవసాయం: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేరుశనగ, పత్తి, కంది, వరి, ఎండుమిర్చి, పచ్చిమిర్చి టమాట, బీరకాయ పంటలు వర్షార్పణం అయ్యాయి. ఇప్పటికి 1064 మంది రైతులకు చెందిన 968.2 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

రైతుల్లో ఆందోళన

జిల్లాలో ఈఏడాది వానాకాలం సీజన్ ఆరంభం నుంచి ఆశాజనకంగా సాగుతోంది. జూన్, జులై, ఆగస్టు నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిశాయి. బోర్లు రీజార్జ్ అయ్యాయి. ఇక్కడి రైతులు ప్రధానంగా పండించే పత్తి, వేరుశనగ, కంది పంటలతో పాటు, ఉద్యాన పంటలైన ఎండుమిర్చి, టమాట, బీర ఇలా దాదాపు అన్ని పంటలు బాగానే ఉన్నాయి. ఇక జూరాల నీటి విడుదలతో వరి నాట్లు కూడా వేశారు. అన్ని పంటలు బాగా వస్తున్నాయి అని అనుకుంటున్న సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.



కేటీదొడ్డి మండలం నందిన్నె శివారులో వర్షార్పణమైన వేరుశనగను పరిశీలిస్తున్న ఏఈఓ ప్రీతిసుధ

వివరాలు సేకరించిన వ్యవసాయ అధికారులు

వర్షాలతో నష్టం వాటిల్లిన పంట పొలాలను వ్యవసాయ మండల, విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించారు. పంట రకం, ఎకరాలు, ఏదశలో ఉంది, రైతు పేరు తదితర వివరాలు సేకరించారు. ఆపంటకు ఎంత శాతం నష్టం వాటిల్లిందో అంచనా వేసి, వివరాల్లో పొందుపర్చారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వివరాలు సేకరించాము. ఆయా పంటలు, గ్రామాలు, రైతుల వారీగా వివరాలు క్రోడకరించి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తాము. – సక్రియానాయక్, డీఏఓ

జిల్లా వివరాలిలా..

పంట	నష్టం (ఎకరాల్లో)	నష్టపోయిన రైతుల సంఖ్య
పత్తి	368	428
వరి	234	54
ఎండుమిర్చి	195	368
కంది	148	203
వేరుశనగ	18	8
కూరగాయలు	5.20	3

పంటలపై ప్రభావం

వరుసగా దంచి కొడుతున్న వర్షాలు పంటలపై ప్రభావాన్ని చూపుతున్నాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీనివల్ల కాస్త లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట చేలలోకి నీరు చేరింది. దీంతో పాటు చాలా చోట్ల పొలాల్లో నీరు అలాగే ఉండిపోవంతో పంటలు నీట మునిగాయి. జిల్లాలో ప్రధానంగా ఇటిక్యాల మండలంలో పలు గ్రామాల్లో పత్తి, ఎండుమిర్చి, కంది, రాజోళి మండలంలో పత్తి, వరి వడ్డేపల్లి మండలంలో పత్తి, బీర, టమాట, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల్లో వేరుశనగ, అయిజ మండలంలో పత్తి, ఎండుమిర్చి, అలంపూర్‌లో వేరుశనగ, పచ్చిమిర్చి పంటలకు 35 నుంచి 80శాతం నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. పత్తి పంటకు సరిగ్గా కాయ కాసే, పూత దశల్లో, ఎండుమిర్చి, కంది ఏపుగా పెరుగుతున్న దశలో, చేతికి వచ్చిన దశలో వేరుశనగ, టమాట, బీర, నాట్లు వేసిన దశలో వరి పంటలు వర్షార్పణం అయ్యాయి.

కొలువుదీరిన గణనాథులు



కలెక్టరేట్‌లో వినాయకునికి పూజలు నిర్వహించిన కలెక్టర్ దంపతులు, జిల్లా అధికారులు

భక్తిశ్రద్ధలతో పూజలు

గద్వాలటౌన్: వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి విగ్రహాలకు పైగా ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఆలయాలు, యువజన, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో గణనాథులను కొలువుదీర్చారు. గద్వాలలోని పలు కూడళ్ల విగ్రహాల ప్రతిష్ఠలతో కళకళలాడాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో వెలుతురు విరజిమ్మాయి. మండపాల ఏర్పాటులో యువకులు పోటీ పడి ఆకర్షనీయంగా అలంకరించారు. అయిజ, అలంపూర్, శాంతినగర్‌లో సైతం జిల్లా కేంద్రానికి దీటుగా గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ చూసినా పాటలు, భజనలతో మండపాలు హోరెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ప్రతిష్ఠించిన గణేష్ మండపాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఎస్‌కే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతికి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆకార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమకు డీఎస్పీ సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పట్టణంలోని పలు మండపాలలోని వినాయకులను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ప్రజలంతా సుఖ:సంతోషాలతో ఉండాలి

గద్వాల: విఘ్నలు తొలగి ప్రజలంతా సుఖ:సంతోషాలతో ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం వినాయకచవితిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మట్టివినాయకుని ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలపై ఉండాలని, పర్యావరణాన్ని కాపాండేందుకు మట్టివినాయకుడిని పూజించాలన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఏవో వీరభద్రప్ప, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



పూజలు చేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే సహించేదిలేదు



వడ్డేపల్లి గట్టుపై దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడితే సహించేదిలేదని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి గట్టుపై ఉన్న ఎర్రమట్టిని అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ కంపెనీవారు తవ్వకాలు జరుపుతున్నారంటూ వారి టిప్పర్‌లను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏఐసీసీ కార్యదర్శి శనివారం అడ్డుకున్నారు. వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఎర్రమట్టిని భారత్‌మాల రహదారికి తరలిస్తున్నారనే సమాచారంతో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో గట్టు వద్దకు చేరుకున్నారు. మట్టి తరలిస్తున్న టిప్పర్లను నిలిపేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు అక్రమ మైనింగ్ గురించి సమాచారం ఇచ్చారు. స్పందించిన వడ్డేపల్లి తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస శర్మ, ఎస్‌ఐ సంతోష్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మట్టి తరలిస్తున్న టిప్పర్‌లను శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్‌చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడుతున్నారని సంపత్‌కుమార్ ఆరోపించారు. భవిష్యత్తులో అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకుని సహజవనరులను కాపాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అవినీతికి తావులేదని, ప్రభుత్వ ఆస్తుల్ని కాజేయాలని చూసే కాంట్రాక్టర్లను కతం చేయడమే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని ఆయన అన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలం పరిశీలన

వడ్డేపల్లి గట్టుపై నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని, పాఠశాలకు సంబంధించిన మ్యాప్‌ను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 పాఠశాలలు మంజూరయ్యాయని, అందులో వడ్డేపల్లికి ఒకటి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

చిన్నోనిపల్లె నిర్వాసితులకు అండగా ఉంటా



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

గట్టు: చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులకు అండగా ఉంటానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నోనిపల్లె ముంపు గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. మోకాలు లోతు నీటిలో నడుచుకుంటూ వెళ్లి ఇళ్లను పరిశీలించారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట గండిని పూడ్చడంతో భారీ వర్షాలకు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ గ్రామంలోకి చేరుకున్నాయి. ఇళ్లలోకి రిజర్వాయర్ నీరు వచ్చి చేరడంతో ఎమ్మెల్యే ముంపు గ్రామంలో పర్యటించారు. ప్రతి కుటుంబం ఇల్లును ఖాళీ చేసినందుకు ప్రభుత్వం రవాణా ఖర్చులను చెల్లిస్తుందని, పునరావాస కేంద్రంలో మౌళిక వసతులను కల్పించనుందని అన్నారు. రిజర్వాయర్ పనులు 70 శాతం పూర్తయ్యాయని, భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ఇళ్ల మధ్యకు వచ్చిందని, ప్రతి కుటుంబం గ్రామాన్ని వదిలి పునరావాస కేంద్రంలోకి మారాలని కోరారు. షిఫ్టింగ్ చార్జీలు, ఇళ్ల పట్టాలు అందరికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పునరావాస కేంద్రంలో విద్యుత్, తాగు నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్, మునిచంద్రగౌడు పాల్గొన్నారు.

రిర్వాయర్ కట్ట పరిశీలన

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతున్న తరుణంలో ప్రమాదం పొంచి ఉందని లింగాపురం, బోయలగూడెం గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో ఎమ్మెల్యే రిజర్వాయర్ కట్టను పరిశీలించారు. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విషయాన్ని కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈసారైనా.. కదిలేనా?!

సందిగ్ధంగా మారిన పర్యాటక లాంచీ ప్రయాణం

- సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో వెళ్లేందుకు ఏర్పాటు
- గతేడాది ఒక్క ట్రిప్పు కూడా తిరగని వైనం
- రవాణా చార్జీలు, మధ్యలో విడిది లేక ఆసక్తి చూపని పర్యాటకులు
- సమస్య పరిష్కారంపై దృష్టిసారించని పర్యాటక శాఖ



సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో తిరిగే ఏసీ లాంచీ



సోమశిల పరిసరాల్లో మినీ లాంచీ

కొల్లాపూర్: సోమశిల నుంచి కృష్ణానది గుండా శ్రీశైలం వరకు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన లాంచీ ప్రయాణం సందిగ్ధంగా మారింది. లాంచీ ఏర్పాటు చేసినప్పటి నుంచి కూడా పర్యాటకులు పెద్దగా ఈ ప్రయాణానికి ఆసక్తి చూపడం లేదు. గతేడాది ఒక్కసారి కూడా లాంచీ ప్రయాణం సాగలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీనికి పలు రకాల కారణాలు ఉండగా.. ఈ సమస్యలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు ముగింపు పలుకుతారనే ఆశాభావంతో పర్యాటకులు ఉన్నారు.

రెండు లాంచీల ఏర్పాటు

నల్లమల కొండల మధ్యలో ప్రవహించే కృష్ణానది అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని టూరిజం అధికారులు దాదాపుగా పదేళ్ల క్రితం సోమశిలలో మినీ లాంచీ ఏర్పాటు చేశారు. దీనికి పర్యాటకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ లాంచీని సోమశిల పరిసరాల్లో మాత్రమే తిప్పేవారు. అయితే సోమశిల నుంచి శ్రీశైలానికి వెళ్లేందుకు కూడా మరో లాంచీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ రావడంతో 2019లో స్వదేశీ దర్శన్ నిధులు రూ.2.5 కోట్లతో 120 మంది ప్రయాణించేందుకు వీలుగా ఏసీ లాంచీ ఏర్పాటు చేశారు. కానీ, ఈ లాంచీలో ప్రయాణాలు అరకొరగానే సాగుతున్నాయి.

నిర్వహణ భారంతో..

ఏసీ లాంచీ ద్వారా సోమశిల నుంచి శ్రీశైలానికి ప్రయాణాలు సాగకపోవడానికి పలు రకాల కారణాలు ఉన్నాయి. ఈ లాంచీలో కనీసం 60 నుంచి 70 మంది ప్రయాణికులు ఉంటేనే లాంచీ కదులుతుంది. అలా అయితేనే లాంచీ మెయింటెనెన్స్‌కు సరిపోతుంది. ఒకేసారి అంతమంది లాంచీ ప్రయాణాలకు సిద్ధం కావడం లేదు. తక్కువ మంది ఉంటే లాంచీ వెళ్లదని పర్యాటకులను తిప్పి పంపుతున్నారు. సోమశిల నుంచి శ్రీశైలానికి వెళ్లేందుకు దాదాపుగా 7 గంటల సమయం పడుతుంది. ప్రయాణం మధ్యలో ఎక్కడా విడిది చేసే అవకాశాలు లేవు. ఇది పర్యాటకులకు ఇబ్బందికరంగా మారింది. లాంచీ ప్రయాణ చార్జీలు కూడా రూ.2–5 వేల వరకు ఉన్నాయి. వీటికి తోడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దు కారణంగా లాంచీని ఈగలపెంట వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. అక్కడి నుంచి బస్సుల్లో శ్రీశైలానికి చేరుకోవాల్సి ఉండటంతో చాలా మంది రోడ్డు ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు.

లాంచీ ప్రయాణ చార్జీల వివరాలు ఇలా..

ప్రాంతం	పెద్దలకు (రూ.లలో..)	పిల్లలకు (రూ.లలో..)
1. హైదరాబాద్ నుంచి బస్సులో సోమశిలకు వచ్చి అక్కడి నుంచి ఈగలపెంట వరకు (లాంచీలో ప్రయాణం శ్రీశైలంలో విడిది, భోజనం. మరుసటి రోజు ఈగలపెంట నుంచి సోమశిలకు లాంచీలో చేరుకుని తిరిగి బస్సులో హైదరాబాద్ చేరుకునేందుకు ఈ మొత్తం వసూలు చేస్తారు.)	4,499	3,600
2. సోమశిల నుంచి ఈగలపెంట వరకు లాంచీలో వెళ్ల మళ్లీ మరుసటి రోజు ఈగలపెంట నుంచి సోమశిల వచ్చేందుకు (టూవే) చార్జీ	2,600	2,100
3. సోమశిల నుంచి ఈగలపెంట వరకు వెళ్లడం లేదా ఈగలపెంట నుంచి సోమశిలకు వచ్చేందుకు (వన్‌వే) చార్జీ	2,000	1,600

లాంచీ ప్రయాణాలు ఇలా..

శ్రీశైలం లాంచీని 2019లో ప్రారంభించాక ఇప్పటి వరకు కేవలం 17 సార్లు మాత్రమే సోమశిల– శ్రీశైలం మధ్య తిప్పారు. 2019లో నాలుగు సార్లు, 2020లో 11 సార్లు, 2022లో రెండుసార్లు మాత్రమే తిప్పారు. 2021, 2023లో ఎలాంటి ప్రయాణాలు సాగలేదు. ఈ ఏడాది ఆగస్టు నుంచి కృష్ణానది నిండుకుండలా ఉన్నప్పటికీ లాంచీ ప్రయాణం ఇంకా ప్రారంభం కాలేదు.

మినీ లాంచీకి ఆదరణ

సోమశిల నుంచి శ్రీశైలానికి వెళ్లే లాంచీకి గిరాకీ లేక వెలవెలబోతుంటే.. సోమశిల పరిసరాల్లో మాత్రమే తిరిగే మినీ లాంచీకి మాత్రం ఫుల్ గిరాకీ ఉంటోంది. ఈ లాంచీలో 15 నిమిషాల పాటు తిప్పేందుకు పెద్దవాళ్లకు రూ.50, చిన్నపిల్లలకు రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. 20 మంది ప్రయాణికులు జమ అయితే ఈ లాంచీని నదిలో తిప్పుతున్నారు. ఒకవేళ ఎవరైనా రూ.4 వేలు చెల్లిస్తే గంటపాటు వారి బృందం మొత్తాన్ని నదిలో తిప్పుతున్నారు. ఈ ధరలు తక్కువగా ఉండటంతో చాలామంది పర్యాటకులు సోమేశ్వర లాంచీలో తిరిగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మార్పులు చేయాలి..



సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో తిప్పే లాంచీ ప్రయాణంలో మార్పులు చేపట్టాలి. వారానికోసారి లాంచీ పర్యటన సాగేలా షెడ్యూల్ విడుదల చేయాలి. ఆయా తేదీలను ముందుగానే పర్యాటకులకు తెలిసేలా చూడాలి. నిర్ణీత సంఖ్యలో పర్యాటకులు వచ్చినా.. రాకున్నా లాంచీ ప్రయాణం సాగాలి. ఈగలపెంటలో కాకుండా పాతాళగంగ వద్ద లాంచీ ఆపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ప్రయాణం మధ్యలో ప్రయాణికులు సేదతీరేందుకు వీలుగా వసతులు కల్పించాలి. చార్జీలు కూడా కొంత తగ్గించాలి.
– సత్యనారాయణగౌడ్, కొల్లాపూర్

ఉన్నతాధికారులకు వివరించాం



సోమశిల నుంచి శ్రీశైలానికి తిప్పేందుకు టూరిజం శాఖ లాంచీ సిద్ధంగా ఉంది. నిర్ణీత సంఖ్యలో ప్రయాణికులు రాకపోవడం వల్లే గతేడాది లాంచీని తిప్పలేదు. అటవీ శాఖ అనుమతులు, ఇతర అంశాలు ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నాయి. లాంచీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను ఇటీవల జిల్లా, రాష్ట్ర టూరిజం అధికారులకు తెలియజేశాం. వారి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే లాంచీ ప్రయాణాలు ప్రారంభిస్తాం. సోమశిల పరిసరాల్లో తిరిగేందుకు పర్యాటకులకు మినీ లాంచీ అందుబాటులో ఉంది.
– శివకృష్ణ, లాంచీ మేనేజర్

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


బిజేష్‌కుమార్ (ఫైల్)

కొత్తకోట రూరల్: రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కొత్తకోట సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న ఓ దాబాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. రాజస్థాన్‌లోని సిఖర్ జిల్లా, రిను గ్రామానికి చెందిన బిజేష్‌కుమార్ (21) కొంతకాలంగా కొత్తకోట సమీపంలోని బాలాజీ మర్వాడి దాబాను అద్దెకు తీసుకొని నిర్వహిస్తుండేవాడు. కొంతకాలంగా దాబా సరిగా నడవకపోవడంతో పాటు అప్పులు ఎక్కువ కావడంతో తీర్చేందుకు వేరే దారి లేక జీవితంపై విరక్తి చెందిన బిజేష్‌కుమార్ ఆదివారం తెల్లవారుజామున దాబాలోనే ఓ గదిలో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. దాబాలో పనిచేసే వారు గది తలుపులు కొట్టగా ఎంతకూ తెరవకపోవడంతో అనుమానం వచ్చి అడ్డాకులలో దాబా నిర్వహించే అతడి బంధువుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అతను వెంటనే కొత్తకోటకు చేరుకొని గది తలుపులు విరగ్గొట్టి చూడగా వేలాడుతూ చనిపోయి కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆదివారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. బంధువు దేవిలాల్ కుమావత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పురుగుమందు తాగి వ్యక్తి..

ఊట్కూరు: మండలంలోని అమీన్‌పూర్‌లో బడాల్ అంజప్ప (53) పురుగుమందు తాగి మృతి చెందినట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు. అంజప్ప ఏడాది కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడని.. మనస్థాపానికి గురై శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగినట్లు చెప్పారు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే నారాయణపేట ఏరియా ఆస్పత్రికి, అటునుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారని.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. అంజప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు భీమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

తుమ్మెన్‌పేటలో వ్యక్తి..

బల్మూర్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని తుమ్మెన్‌పేటలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓరె లింగం (36) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్య, కుటుంబసభ్యులు గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన లింగం గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తుడు కార్తీక్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బల్మూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన ఎల్లమ్మ (36) మండలంలోని రామాజిపల్లిలో ఉండే తన కుమార్తె మమతను చూడటానికి గత నెల 30న తమ్ముడు మేకల మల్లేష్ బైక్‌పై బయలుదేరింది. జినుకుంట స్టేజీ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడటంతో ఎల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి, అటు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ వివరించారు. కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నవాబుపేట: గణపతి పూజకు అవసరమైన పూలు, పత్రి విక్రయించి వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన రాజాపూర్ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నవాబుపేట మండలం కారూర్ గ్రామానికి చెందిన గోపనమోని జంగయ్య (35), మైబు గణపతి పూజ సామగ్రితో జడ్చర్లకు వెళ్లి విక్రయించారు. తిరిగి సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా.. రాజాపూర్ సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో జంగయ్యకు తీవ్రగాయాలై మృతిచెందాడు. ప్రమాదంలో మైబుకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బైక్, ఆటో ఢీకొని వ్యక్తి..

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. నారాయణపేటకు చెందిన నవీన్(29) బైక్‌పై జాతీయ రహదారిపై వెళ్తుండగా ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆటోను ఢీకొట్టింది. దీంతో నవీన్ కింద పడిపోగా వెనకాల అతివేగంగా వచ్చిన కారు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రిలో ఉంచినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

కళ్లెదుటే.. కానరాని లోకాలకు


చిన్నారుల మృతికి కారణమైన ఆసిరెడ్డి చెరువు

- చెరువులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి
- కాపాడేందుకు తల్లి, మేనత్త, మరో ఇద్దరు చిన్నారుల యత్నం
- ప్రమాదవశాత్తు వారు సైతం నీటిలో మునక
- నలుగురిని కాపాడిన పశువుల కాపరి
- తిర్మలాపూర్‌లో విషాదచాయలు


రోహిత్, ప్రీతి మృతదేహాలు

నారాయణపేట రూరల్: కళ్ల ముందే తన పిల్లలు చెరువులో మునిగిపోవడంతో ఆ తల్లి గుండె తల్లడిల్లింది. క్షణం ఆలస్యం చేయకుండా వారిని కాపాడే ప్రయత్నంలో చెరువులోకి దూకింది. లోతు అధికంగా ఉండడంతో ఇద్దరు చిన్నారులు నీట మునిగి విగతజీవులుగా మారగా.. తల్లి సైతం అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ఈ ప్రమాదంలో మొదటి ఇద్దరు చిన్నారులను కాపాడేందుకు.. మరో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు చెరువులో దూకగా.. అటుగా ఉన్న కొందరు గొర్రెల కాపరులు నలుగురిని రక్షించారు. తల్లి, మరో ఇద్దరు చిన్నారులు అపస్మారక స్థితిలోకి చేరగా ఆస్పత్రిలో చేర్పారు. ఒకే ఇంట్లో ఇద్దరు చిన్నారుల మృతితో తిర్మలాపూర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది.

సోదరుడి దినకర్మకు వచ్చి..

నారాయణపేట మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చెంచు తిమ్మమ్మ, కిష్టప్ప దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుల్లో ఒకరు వివాహం చేసుకుని వికారాబాద్‌కు వలస వెళ్లి మేస్త్రీ పనిచేస్తుండగా, మరొకరు గ్రామంలోనే ఉంటున్నారు. ఇక కుమార్తె రజిష్ణ దాదాపు 18 సంవత్సరాల క్రితమే ఓంకార్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుని కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌లో స్థిరపడింది. వీరికి రోహిత్(11), ప్రీతి (13), మంగళ, రాజమ్మ అనే నలుగురు సంతానం. చాలా రోజులుగా పుట్టింటికి దూరంగా ఉన్న తనకు ఇటీవల సోదరుడు బాలప్ప మృతిచెందిన విషయం తెలియడంతో అంత్యక్రియలకు చేరుకోలేకపోయింది. దీంతో శనివారం నిర్వహించిన దిన కర్మకు భర్త, పిల్లలతో వచ్చింది. ఆదివారం బియ్యం పెట్టించుకుని తిరుగుప్రయాణం అవుతుండగా, భర్త ఓంకార్ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నారాయణపేటకు వెళ్లాడు.

ఆటవిడుపు కోసం వెళ్లి..

పిల్లలను చెరువు చూసి రమ్మని తండ్రి చెప్పడంతో నలుగురు చిన్నారులు, తల్లి, మేనత్త పద్మ, మరో బంధువు సత్యమ్మతో కలిసి తిర్మలదేవునిపల్లి శివారులోని ఆసిరెడ్డి చెరువుకు వెళ్లారు. ముందుగా ఈ నలుగురితోపాటు పద్మ పిల్లలైన నాగేశ్వరి, చింటుకు స్నానం చేయించి గట్టుపై తల ఆరబెట్టుకోమని చెప్పి, ముగ్గురు మహిళలు దుస్తులు ఉతికి ఆరబెట్టడానికి పక్కకు వెళ్లారు. అంతలోనే రోహిత్, ప్రీతి మరోసారి స్నానం చేసేందుకు చెరువులోకి దిగడం.. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయారు. వెంటనే గమనించిన చిన్నారులు మంగళ, రాజమ్మ వారిని కాపాడేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వారు సైతం నీటిలో పడిపోయారు. కేకలు విన్న తల్లి, మేనత్త నీటిలోకి దిగి సత్యమ్మ ద్వారా చీరను తీసుకుని కాపాడే ప్రయత్నం చేయగా సాధ్యపడలేదు. వారు సైతం నీటిలో మునిగిపోయారు. అటుగా ఆవులు కాస్తున్న దస్తప్పను పిలుచుకుని రాగా ఆయన నీటిలోకి దిగి ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులను కాపాడగా, ముందుగా దిగిన ఇద్దరు చిన్నారులు నీటిలో అప్పటికే మునిగి కన్నుమూశారు.

తల్లికి కడుపుకోత..

కళ్లెదుటే తన పిల్లలు మృతిచెందడం చూసిన తల్లి అపస్మారస్థితిలోకి వెళ్లింది. ఇదిలా ఉండగా.. ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిన మహిళ ఎన్నో సంవత్సరాల తర్వాత సోదరుడి మృతి వార్త విని తల్లిగారింటికి వచ్చింది. ఆ బాధను మరిచిపోక ముందే ఇద్దరు చిన్నారులను పోగొట్టుకుని ఆ తల్లి కడుపుకోతను చూసి గ్రామ ప్రజలు కన్నీరు పెట్టారు. మృతిచెందిన ఇద్దరి పిల్లల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారుల్లో పెద్ద కూతురు కోటకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మరోపాప పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పిల్లల తండ్రి ఓంకార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి గుంతలో పడి బాలుడు..


పట్టాభి (ఫైల్)

శాంతినగర్: నీటి గుంతలో పడి బాలుడు మృతిచెందిన ఘటన వడ్డేపల్లి మండలం తనగలలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పట్టాభి (9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతుండేవాడు. వినాయక చవితి సెలవుదినం కావడంతో మిత్రుడితో కలిసి సమీపంలోని గట్టుపైకి ఆడుకునేందుకు వెళ్లాడు. రైతువేదిక సమీపంలో రోడ్డు పనులకు తీసిన గుంతలో నిలిచిన నీటిలో పడి మునిగి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

- 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 20 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల


జూరాల ప్రాజెక్టు నుంచి 20 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద మళ్లీ పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి 1,55,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి 20 క్రస్టు గేట్లు ఎత్తి 1,41,060 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28,779 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. క్రస్టు గేట్ల ద్వారా 1,41,060 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45, భీమా లిఫ్టు-2కు 650, ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు 160 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,70,984 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 92,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 90,179 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 94,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,06,110 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 146.671 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 116.675 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 263.346 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని చెప్పారు.

రామన్‌పాడు నుంచి 5 వేల క్యూసెక్కులు విడుదల..

మదనాపురం: రామన్‌పాడు జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. కోయిల్‌సాగర్, మన్నెవాగు, ఊకచెట్టు వాగులతో పాటు సరళాసాగర్, శంకర సముద్రం నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. అధికారులు ఒక గేటు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మదనాపురం వద్ద వాగు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

కోయిల్‌సాగర్‌లో 5 గేట్లు ఎత్తి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి 5 గేట్లను ఎత్తి నీటి విడుదల కొనసాగించారు. వారం రోజులుగా ప్రాజెక్టులోకి వస్తున్న వరద మేరకు గేట్లను తెరుస్తున్నారు. శనివారం నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో మూడు గేట్లను తెరిచారు. ఆదివారం మళ్లీ వరద పెరగడంతో 5 గేట్లను ఒక అడుగు మేర తెరచి 3,500 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదులుతున్నారు. ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీటిని చూస్తూ ఆనందంలో మునిగితేలారు.

వేర్వేరుచోట్ల రైలు ఢీకొని ఇద్దరు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కిందపడటంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన పి.కృష్ణారెడ్డి(75) ఆదివారం మధ్యాహ్నం బండమీదిపల్లి సమీపంలోని అండర్ రైల్వే బ్రిడ్జి దగ్గర పట్టాల పక్కనే నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో గూడ్స్ రైలు వచ్చి ఢీకొట్టింది. రైల్వే సిబ్బంది గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చికిత్స కోసం మొదట ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గూడ్స్‌రైలు ఢీకొని..

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి గ్రామ శివారులో గూడ్సు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి(30) మృతిచెందాడని గొల్లపల్లి స్టేషన్‌మాస్టర్ లాలన్‌కుమార్ తెలిపారు. మృతుడి ఎదపై దేవి అనే పచ్చబొట్టు ఉందని, ఎవరైనా గుర్తిస్తే సెల్ నం.98480 90426కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


వెంకటేశ్వర్లు (ఫైల్)

శాంతినగర్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు రాధాస్వామి సత్సంగ్‌బ్యాస్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. సత్సంగంలో స్వచ్ఛంద సేవ కార్యక్రమంలో భాగంగా కలుపు మొక్కలు తొలగించే పనులను శిష్యులంతా చేపట్టారు. గ్రామానికి చెందిన కుర్వ వెంకటేశ్వర్లు (50) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దుందుభీ వాగులో తప్పిన ప్రమాదం

- వాగులో కొట్టుకుపోతున్న కారుతో సహా తొమ్మిది మందిని కాపాడిన పోలీసులు, గ్రామస్తులు
- నాగర్‌కర్నూల్ జిల్లా సిర్సవాడ వద్ద ఘటన


ప్రమాదం నుంచి బయటపడిన వారితో సీఐ, ఎస్‌ఐ, సిర్సవాడ గ్రామస్తులు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ దుందుభీ వాగులో పెను ప్రమాదం తప్పింది. కారులో తొమ్మిది కొట్టుకుపోతుండగా గ్రామస్తులు, పోలీసులు క్షేమంగా కాపాడారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిన్నఆదిరాల గ్రామానికి చెందిన 9 మంది వ్యక్తులు కారులో ఆదివారం ఉదయం కొల్లాపూర్ సమీపంలోని సోమశిలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సిర్సవాడ వద్ద దుందుభీ వాగు దాటుతుండగా.. ఒక్కసారిగా వరద ఎక్కువ కావడంతో ప్రమాదంలో చిక్కుకున్నారు. వెంటనే వారు డయల్ 100కు సమాచారం అందించగా.. అప్రమత్తమైన తాడూరు ఎస్‌ఐ మహేష్ గ్రామంలోని కొందరు యువకులకు సమాచారం అందించారు. వెంటనే యువకులు రెండు ట్రాక్టర్లతో వాగు వద్దకు వచ్చారు. ఈ క్రమంలోనే పోలీసులు సైతం అక్కడికి రాగా.. వాగులో కొట్టుకుపోతున్న 9 మందిని ఎస్‌ఐ మహేష్, గ్రామ యువకులు ట్రాక్టర్లలో ఎక్కించుకుని బయటకు తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన పోలీసులు, గ్రామ యువకులను సీఐ కనకయ్య అభినందించారు. అయితే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటు జడ్చర్ల, అటు కల్వకుర్తి జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్ మూడు నియోజకవర్గాలను కలిపే ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థినుల కిడ్నాప్ కలకలం

నిందితులకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

గద్వాల క్రైం: ఇద్దరు విద్యార్థినుల కిడ్నాప్ వ్యవహారం జోగుళాంబ గద్వాల జిల్లాలో కలకలం రేపింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం పాఠశాలకు వెళ్లేందుకు గాను బస్సు కోసం స్టేజీ వద్ద నిల్చున్నారు. ఈ క్రమంలో బైక్‌లపై వచ్చిన తిరుమల్లేష్, రంజిత్ అనే యువకులు స్కూల్ వద్ద వదిలిపెడతామని విద్యార్థినులను నమ్మించి బైక్‌లపై ఎక్కించుకున్నారు. వారిని స్కూల్‌కు తీసుకెళ్లకుండా పట్టణ శివారులోని ఓ గదిలోకి తీసుకెళ్లి బంధించారు. కేకలు వేస్తే మీ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించి, సాయంత్రం వరకు ఆ గదిలోనే పెట్టారు. అయితే విద్యార్థినులు పాఠశాలకు హాజరుకాని విషయాన్ని యాజమాన్యం వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఆందోళనకు గురయ్యారు. విద్యార్థినుల కోసం బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది.

7 గంటల సమయంలో ఇంటికి..

విద్యార్థినులను కిడ్నాప్ చేసిన యువకులు సాయంత్రం 7 గంటల సమయంలో విద్యార్థినులను ఇంటికి పంపారు. ఇంటికి వచ్చాక తల్లిదండ్రులు ఆరా తీయగా.. విద్యార్థినులు ఏడుస్తూ జరిగిన విషయాన్ని చెప్పారు. అయితే శనివారం అర్ధరాత్రి తిరుమల్లేష్, రంజిత్‌తో పాటు మరో నలుగురు కలిసి బైక్‌లపై ఆ విద్యార్థినుల ఇంటి పరిసర ప్రాంతాల్లో కేకలు వేస్తూ తిరిగారు. విద్యార్థినులు బయటకు రాకుంటే చంపుతామంటూ హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆ యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులో టీ స్టాల్ వద్ద ఉన్న ఇద్దరు యువకులను బాధిత కుటుంబ సభ్యులు గుర్తించి, దేహశుద్ధి చేశారు. అనంతరం రూరల్ పోలీసులకు అప్పగించారు. విద్యార్థినుల కిడ్నాప్, బ్లాక్ మెయిల్ చేసిన ఇద్దరు యువకులతో పాటు మరో నలుగురిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, విద్యార్థినులను కిడ్నాప్‌కు పాల్పడిన వారిని జిల్లా కేంద్రానికి చెందిన తిరుమల్లేష్, మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన రంజిత్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వారిద్దరిపై పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ వెల్లడించారు. వీరికి సహకరించిన యువకులను సైతం త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

శెభాష్ శ్రీకాంత్

విద్యుత్ సమస్య పరిష్కారం కోసం సహసం


విద్యుత్ స్తంభంపై మరమ్మతు చేస్తున్న లైన్‌మన్ శ్రీకాంత్

నవాబుపేట: చెరువులో ఉన్న విద్యుత్ స్తంభంపై ఏర్పడిన సమస్యతో పండగ వేళ పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. విషయం తెలుసుకున్న లైన్‌మన్ ఏకంగా చెరువులో ఈదుకుంటూ వెళ్లి మరీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివరాల్లోకి వెళ్తే.. నవాబుపేట మండలం పోమాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా, వినాయక చవితి కావడంతో లైన్‌మన్ శ్రీకాంత్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రంగయ్యబావితండా చెరువు సమీపంలో విద్యుత్ పోల్‌ఫాల్ట్ ఉన్నట్లు గుర్తించి, రాత్రి 9 గంటల ప్రాంతంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా చెరువులో ఈదుకుంటూ వెళ్లి స్తంభంపై విద్యుత్ వైర్లను సరిచేశారు. ఈ సందర్భంగా లైన్‌మన్ శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

పశువుల కాపరి మృతదేహం లభ్యం



తిరుపతన్న (ఫైల్)

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు వాగులో గల్లంతైన పశువుల కాపరి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్‌ఐ నరేందర్ వివరాల మేరకు.. మండలంలోని మేడేపల్లికి చెందిన తిరుపతన్న (45) పుట్టుకతోనే మూగ చెవిటి. అతడు పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శనివారం పశువులను మేపి ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో గ్రామశివారులోని దొరాయికుంట వాగులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది రాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం అతడి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మహిళ మృతదేహం..

బల్మూర్: స్థానిక ఊర చెరువులో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని బయటికి తీసి పరిశీలించామన్నారు. 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని.. నలుపురంగు చుక్కల టాప్, లెగ్గిన్ ధరించి ఉందని, బాగా కుళ్లిపోయి కనిపించడంతో అక్కడే పోస్టుమార్టం చేయించి ఖననం చేసినట్లు వివరించారు. ఐదురోజుల కిందట పడి ఉంటుందని.. గుర్తించలేని స్థితిలో ఉందన్నారు. చేతికి ఆకుపచ్చ గాజుతో పాటు ఎడమ కాలికి నల్లటి దారం, గజ్జెలు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 87126 57736, 87126 57731 సమాచారం ఇవ్వాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

లభించని మహిళ ఆచూకీ


చెన్నమ్మ కోసం గాలిస్తున్న పోలీసులు

రాజాపూర్: దుందుభీ వాగులో పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చి అదృశ్యమైన మహిళ ఆచూకీ లభించ లేదు. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలం గుండ్లపొట్లపల్లికి చెందిన చెన్నయ్య భార్య చెన్నమ్మ (46) శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా దుందుభీ వాగు వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తనకు తెలిసిన వారికి ఫోన్ చేసి తాను దుందుభీ వాగులో పడి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. వెంటనే కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు వాగు వద్దకు వెళ్లి చూడగా.. వాగు ఒడ్డుపై చెన్నమ్మకు సంబంధించిన కాళ్ల పట్టీలు, సెల్‌ఫోన్ లభించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపటినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆదివారం వాగులో వరద ఉధృతి పెరగడంతో డ్రోన్ కెమెరాలను తెప్పించి, వాగు శివారు ప్రాంతాల్లో సైతం గాలింపు చర్యలు చేపట్టారు.

ఫొటో స్టూడియో దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఫొటో స్టూడియో

గోపాల్‌పేట: షార్ట్ సర్క్యూట్‌తో ఫొటో స్టూడియో దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. మండలంలోని పొల్కెపహాడ్‌కు చెందిన ప్రసాద్ కొన్నేళ్ల క్రితం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద ఫొటో స్టూడియో, టీస్టాల్ ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఫొటో స్టూడియోకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి షాపులోని రెండు జిరాక్స్ మిషన్లు, ఒక ల్యామినేషన్ మిషన్, కంప్యూటర్, కెమెరాలన్నీ కాలిపోయాయి. ప్రమాదంలో రూ. 2.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కాగా, ఫొటో స్టూడియో సమీపంలోని ఇంటి మీటర్ వద్ద కూడా మంటలు చెలరేగాయని కాలనీవాసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

రూ. 1.52 లక్షల నగదు అపహరణ

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని రెండు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.1.52 లక్షలు ఎత్తుకెళ్లారు. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని కృష్ణవేణి చౌక్‌లో ఉన్న కృష్ణారెడ్డి ఆస్పత్రి, లక్ష్మీ వేంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం వెనుకవైపు ఉన్న తలుపులు విరగ్గొట్టి మెడికల్ దుకాణంలో ఉన్న రూ.1.50 లక్షలు, ఫర్టిలైజర్ దుకాణంలోని రూ. రెండు వేలు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న హార్డ్‌వేర్ దుకాణం తాళం సైతం ధ్వంసం చేశారు. ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన యజమానులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలాన్ని, సీసీ ఫుటేజీని పరిశీలించారు. సీఐ నాగేశ్వరరెడ్డి, పట్టణ ఎస్‌ఐ శ్రీనివాసులు బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.